సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 25, మార్చి, 2024



సోమశిలలో 10.88 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 10.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నా డెల్టాకు 2180 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.68,390
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,142
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,326
నవర (8 గ్రాములు)	రూ.50,608

గరిష్టం/కనిష్టం 35.5 /25.1

వాతావరణం

గాలిలో తేమ 68 శాతంగా ఆదివారం నమోదైంది. ఉష్ణోగ్రతల్లో సోమవారం పెద్ద మార్పు ఉండదని వాతావరణ అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

వేడుకగా పల్లకి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పల్లకి ఉత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. స్వామివారికి హనుమంతసేవను రాత్రి జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉభయకర్తలుగా మాగుంట కుటుంబసభ్యులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మోహినీ అలంకారాన్ని సోమవారం ఉదయం ఎనిమిదికి.. పూలంగిసేవను సాయంత్రం.. బంగారు గరుడసేవను రాత్రి నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. హరనాథపురంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశాన్ని అగ్రికల్చర్ మార్కెటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఏపీజీఈఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, వైస్ చైర్మన్ నవీన్‌కుమార్, మార్కెటింగ్ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవసహాయం, జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, సెక్రటరీ రామాంజనేయులు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): క్షయ రహిత జిల్లాగా నెల్లూరును మార్చేందుకు కృషి చేద్దామని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఏఎన్‌ఎంలతో అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ మాట్లాడారు. టీబీ రావడానికి కారణాలు, నివారణ మార్గాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పరీక్షలు, వైద్యసేవలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు అవార్డులను అందజేశారు.

ఇసుక రీచ్‌లో విజిలెన్స్ తనిఖీలు



సంగం: సంగం పరిధిలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీలను ఆదివారం చేపట్టారు. రీచ్‌లో రాత్రి వేళ భారీ యంత్రాలతో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారా అనే అంశాన్ని ఆరాతీశారు. పూర్తిగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. నిబంధనలను అతిక్రమించి పెన్నా నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్‌ఈబీ సీఐ యశోధర, మైనింగ్ డీడీ, విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్, తహసీల్దార్ రమాదేవి, ఆర్‌ఐ రాజనారాయణ, వీఆర్‌ఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి ఇంట టికెట్ మంట



టికెట్ల కేటాయింపు వ్యవహారం టీడీపీ అధిష్టానానికి తీవ్ర తలనొప్పులు తెస్తోంది. నిన్నామొన్నటి వరకు నేతల మధ్య మాటలు, బలప్రదర్శనలకే పరిమితమైన కుమ్ములాటలు ఇప్పుడు ఒక్కసారిగా బజారునపడ్డాయి. కందుకూరు టికెట్ కోసం ఒకే కుటుంబానికి చెందిన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్ మధ్య రాజుకున్న చిచ్చుతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. పోరు ఇదే తరహాలో కొనసాగితే నియోజకవర్గంలో పార్టీకి మరోసారి భంగపాటు తప్పదనే చర్చ నేతల్లో జరుగుతోంది.

నాగేశ్వరరావు అభ్యర్థిత్వంపై రాజేష్ ఫైర్

- అధిష్టాన దూతలు బుజ్జగించినా వెనక్కి తగ్గని వైనం
- టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎన్నికల ప్రచారం
- పునరాలోచించాలని అధిష్టానానికి అల్టిమేటం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య అంతర్గత పోరు తారస్థాయికి చేరుకుంది. దాయాదులైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్ మధ్య టికెట్ చిచ్చు రాజేసింది. ఈ పరిణామంతో పార్టీలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

ఇన్‌చార్జి పదవి నుంచే స్టార్ట్

తొలుత పార్టీ ఇన్‌చార్జి పదవి, ఆపై కందుకూరు నియోజకవర్గ టీడీపీ టికెట్ కోసం వీరు పోటీ పడ్డారు. చివరికి పార్టీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావును అధిష్టానం ఖరారు చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని ఇంటూరి రాజేష్, ఆయన వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అన్ని విధాలా సేవ చేయడంతో పాటు భారీగా ఖర్చు పెట్టానని.. తీరా టికెట్ విషయంలో తనను సంప్రదించకుండానే నిర్ణయం తీసుకున్నారని రాజేష్ మండిపడుతున్నారు. ఓడిపోయే అభ్యర్థికి కందుకూరులో టికెట్ ఇచ్చారంటూ అధిష్టాన నిర్ణయాన్ని బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు.

ఆత్మీయ సమావేశం పేరిట బలప్రదర్శన

ఈ తరుణంలో కందుకూరు వేదికగా ఐదు రోజుల క్రితం బలప్రదర్శనకు రాజేష్ దిగారు. ఆత్మీయ సమావేశం పేరుతో జనాన్ని సమీకరించి అధిష్టానానికి తన బలమేంటో చూపించేందుకు యత్నించారు.

సంధికి ససేమిరా

అధిష్టాన దూతలుగా ఎమ్మెల్సీ రామ్‌భూపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ వచ్చి రాజేష్‌తో భేటీ అయ్యారు. నాగేశ్వరరావుతో రాజీకి రాజేష్ ససేమిరా అన్నారు. మరోవైపు రాజేష్ కార్యాలయానికి నాగేశ్వరరావు వెళ్లి తనతో కలిసి రావాలని కోరినా, తిరస్కరించారని సమాచారం. టికెట్ కేటాయింపు విషయంలో తనకు అన్యాయం జరిగిందని భావిస్తున్న ఆయన.. నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు.

ఇండిపెండెంట్‌గా బరిలోకి సన్నాహాలు..?

నాగేశ్వరరావుకు పోటీగా కందుకూరులోని సుల్తాన్ మొహిద్దీన్‌నగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని రాజేష్ ప్రారంభించారు. అధిష్టానం తన నిర్ణయాన్ని మార్చుకోని పక్షంలో ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారని, ఇందులో భాగంగానే ప్రచారానికి శ్రీకారం చుట్టారని రాజేష్ వర్గం చెప్తోంది.

నాగేశ్వరరావును ఓడించడమే లక్ష్యం

తనకు పార్టీలో ప్రాధాన్యం లేకపోవడానికి నాగేశ్వరరావే కారణమని భావిస్తున్న రాజేష్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయనతో కలిసి పని చేయాలని అధిష్టానం సూచించిన ససేమేరా అంటూ ఎన్నికల్లో పోటీకే సై అంటున్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసి ఓట్లను భారీగా చీల్చి నాగేశ్వరరావును కచ్చితంగా ఓడిస్తానంటూ సవాల్ విసురుతున్నారు.

ఆ ఇద్దరి మద్దతు ఎవరికో..!

పార్టీలో ఇద్దరు సీనియర్ నేతల మద్దతు నాగేశ్వరరావు, రాజేష్‌లో ఎవరికి లభిస్తుందనే అంశంపైనా చర్చ స్టార్టయింది. మొదట్నుంచి నాగేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ అండగా ఉంటుండగా.. పోతుల రామారావు మాత్రం రాజేష్ వైపు మొగ్గు చూపుతూ వచ్చారు. అయితే పార్టీ టికెట్‌ను నాగేశ్వరరావుకు కేటాయించిన నేపథ్యంలో వీరు ఎవరికి అండగా ఉంటారనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. మరోవైపు వీరిద్దరి మద్దతు తనకే లభిస్తుందని రాజేష్ బహిరంగంగా ప్రకటించుకుంటున్నారు. వీరి అండతోనే తాను రాజకీయంగా ముందుకు సాగుతున్నానని తన వర్గంతో ప్రచారం చేయించుకుంటున్నారు. అయితే ఈ సీనియర్ నేతలు తమ మద్దతును ఇప్పటివరకు ఎవరికీ ప్రకటించలేదు. వీరు ఎవరి వైపు మొగ్గుచూపుతారనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

విభేదాలు బట్టబయలు

కందుకూరు: టీడీపీ కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్ మధ్య ఆధిపత్య పోరు ఆదివారం మరోసారి బట్టబయలైంది. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరిచయ కార్యక్రమాన్ని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, దివి శివరామ్‌తో పాటు ఇంటూరి రాజేష్ కూడా హాజరవుతారని ప్రకటించారు. దీనికి రాజేష్ డుమ్మా కొట్టడమే కాకుండా వేమిరెడ్డి సాక్షిగా బలప్రదర్శనకు దిగారు.

పోటాపోటీ ర్యాలీలు

సింగరాయకొండ ఫ్లయ్‌ఓవర్ నుంచి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించగా.. పోటీగా కందుకూరు నుంచి ఉలవపాడు మండలం కరేడు ప్రచారానికి వెళ్తూ ర్యాలీని రాజేష్ చేపట్టారు. ఇద్దరు నేతలు ఒకరికొకరు ఎదురెదురుగా బలప్రదర్శనకు దిగారు. అనంతరం పామూరు రోడ్డులోని కల్యాణ మండపానికి చేరుకున్న వేమిరెడ్డి, నాగేశ్వరరావు నేతల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సమయంలో ఉలవపాడు మండలం కరేడులో రాజేష్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

చర్చనీయాంశంగా శివరామ్ వ్యవహార శైలి

మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ వ్యవహార శైలి చర్చనీయాంశంగా మారింది. ఆయన తన సోదరులు లింగయ్యనాయుడు, రమేష్‌తో కలిసి సమావేశానికి హాజరయ్యారు. అయితే శివరామ్ వేదికపైకి వెళ్లకుండా కింద కార్యకర్తలతో కూర్చుండిపోయారు. లింగయ్యనాయుడు, రమేష్ సమావేశం జరిగిన హాల్ బయట కారులోనే ఉండి వెనుదిరిగారు. దీంతో దివి కుటుంబసభ్యులు నాగేశ్వరరావుకు సహకరిస్తారా.. లేదాననే అంశం ప్రశ్నార్థకంగా మారింది.

దాయాదుల మధ్య జరుగుతున్న రాజకీయ పోరు పార్టీలో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది.

నిరంతరం అందుబాటులో ఉంటా..



చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న విజయసాయిరెడ్డి తదితరులు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి
- రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు గడ్డపై జన్మించిన తాను.. ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటూ.. నిరంతరం వారికి అందుబాటులో ఉంటానని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి భారీ సన్మాన కార్యక్రమాన్ని బాలాజీనగర్‌లో 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విజయసాయిరెడ్డి, పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. విద్య, ప్రజాసేవ రంగంలో చంద్రశేఖర్‌రెడ్డి ఎదిగిన తీరును వివరించారు. ప్రజాసేవ, సంక్షేమం, అభివృద్ధిలో సామాన్యులకు రాష్ట్రవ్యాప్తంగా అవకాశాలను కల్పించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తానని చెప్పారు. తాను నెల్లూరులో కొందరికే తెలుసంటూ కొంతమంది వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నెల్లూరు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన సీఎంకు కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. తనకు సీఎం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించేలా పాడుపడతామని ప్రకటించారు. తనకు సీఎం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాసేవకు పాటుపడతానని ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. తొలుత విజయసాయిరెడ్డిని గజమాలతో సత్కరించారు.

భారీ బైక్ ర్యాలీ

డివిజన్లోని పూలే విగ్రహ సెంటర్ నుంచి ఏసీ నగర్ వరకు భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. భారీ సంఖ్యలో యువత, మహిళలు స్వాగతం పలికారు.

కమనీయం.. ప్రసన్నుడి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూటక్షేత్ర బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన ప్రసన్నుడి కల్యాణాన్ని కమనీయంగా ఆదివారం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల గోవింద నామ స్మరణలు.. వేదపండితుల మంత్రోచ్చారణలు.. శుభకర మేళతాళాల మధ్య శ్రీవారి కల్యాణం వైకుంఠ వైభవాన్ని తలపించింది. పాతబిట్రగుంట, కొండబిట్రగుంట వీధుల్లో గజవాహనంపై విహరించిన స్వామివారు ఉదయం శుభముహూర్తంలో కల్యాణవేదిక వద్దకు చేరుకున్నారు. పలు ప్రాంతాల నుంచి తెప్పించిన పుష్పాలు, తులసీమాలలతో శోభాయమానంగా అలంకరించిన కల్యాణవేదికపై ఉభయదేవేరులతో స్వామివారు ఆశీనులయ్యారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను కావలి ఆర్డీఓ శీనానాయక్ దంపతులు తీసుకొచ్చారు. తొలుత విష్వక్సేన పూజతో ప్రారంభించి యజ్ఞోపవీతధారణ, కంకణధారణ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఇదే సమయంలో పది జంటలు స్వామివారి సన్నిధిలో ఒక్కటయ్యాయి. ఆయా ఉత్సవాలకు ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కొల్లపనేని వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, ఒట్టిగుంట శ్రీనివాసులు, రాములమ్మ దంపతులు, వ్యహరించారు.

కోలాహలంగా రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉభయదేవేరులతో కలిసి రథంపై ఊరేగారు. కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల్లో రమణీయంగా సాగిన రథోత్సవంలో భక్తుల కర్పూర నీరాజనాలను స్వీకరిస్తూ, విన్నపాలు వింటూ దివ్యాశీస్సులను స్వామివారు అందించారు. ఉభయకర్తలుగా దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ దంపతులు వ్యవహరించారు.



అశేష భక్తజనం మధ్య కోలాహలంగా రథోత్సవం

ప్లాన్డ్‌గా ఏమార్చారు

పేదలకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని కొందరు అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. కొన్ని ప్రభుత్వ భూములను ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూములుగా మార్పు చేస్తూ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. భారీగా ముడుపులు అందడంతో ఈ ఉదంతానికి తెరలేపారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



విరువూరులో రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా మార్పు చేసిన భూములివే

- టీడీపీ ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డుల్లో పేర్ల నమోదు
- సుమారు రూ.నాలుగు కోట్ల విలువైన భూములను కాజేసే యత్నం
- పచ్చనేతల అవినీతిని బయటపెట్టిన 'సాక్షి'
- విచారణలో ఉండగానే ఫ్రీ హోల్డ్ భూములుగా మార్పు

ఉదయగిరి: దాదాపు 20 ఏళ్ల క్రితం డీ ఫారం పట్టాలు పొందిన వారి భూములను 22 ఏ జాబితా నుంచి మినహాయించి క్రయ విక్రయాలకు ప్రస్తుత ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూములుగా మార్పు చేస్తూ నిషేధిత జాబితా నుంచి వరికుంటపాడు గత తహసీల్దార్ తొలగించారు. ఇదే సయయంలో వివాదంలో ఉన్న భూములను ఇతరుల పేర్లతో అక్రమంగా రికార్డుల్లో నమోదు చేశారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా ముడుపులు తీసుకొని 22ఏ జాబితా నుంచి తొలగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్‌కు యత్నాలు

ఈ భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని సమాచారం. ఇదే జరిగితే రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములు ఇతర వ్యక్తుల స్వాధీనంలోకి వెళ్లే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ జరిగితే ఈ భూములు నమోదైన వ్యక్తులకు సర్వ హక్కులు లభిస్తాయి.

ఇదీ జరిగింది..

వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు – 5, 6, 7లో 28.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా గత టీడీపీ హయాంలో అప్పటి తహసీల్దార్ గొల్లపల్లి శ్రీనివాసులు ముడుపులు తీసుకొని రికార్డుల్లో కొందరు వ్యక్తుల పేర్లపై నమోదు చేశారు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం ఈ భూముల విలువ సుమారు రూ.నాలుగు కోట్ల వరకు ఉంటుంది. ఈ అవినీతి పాపంలో టీడీపీ నేతల హస్తం ఉంది. ఈ క్రమంలో 'డబ్బు కొట్టి.. పట్టా పట్టారు' అనే శీర్షికన సాక్షిలో గతేడాది జూన్‌లో కథనం ప్రచురితమైంది.

పట్టించుకోని అధికారులు

దీంతో బినామీ పట్టాదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులను జారీ చేశారు. మూడుసార్లు నోటీసులిచ్చినా సదరు వ్యక్తులు విచారణకు హాజరుకాలేదు. ఈ తరుణంలో పట్టాలను రద్దు చేయాల్సి ఉన్నా, రెవెన్యూ అధికారులు జాప్యం చేశారు. దీనిపై విచారణ జరుగుతున్నా పట్టించుకోకుండా ఓ రెవెన్యూ అధికారి నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూములు (నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు)గా ఇటీవల మార్పు చేశారు. ఈ తంతులో రూ.లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టీడీపీ నేతల పక్కా ప్లాన్

వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలో వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. పైగా ఇవి పామూరుకు సమీపంలో ఉండటంతో మంచి ధర పలుకుతోంది. ఈ తరుణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రకాశం జిల్లా దూబగుంట సమీపంలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి శంకుస్థాపనను నాటి సీఎం చంద్రబాబు చేపట్టారు. దీంతో వరికుంటపాడు మండలానికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఇక్కడి భూములపై కన్నేశారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికలకు ముందు అప్పటి తహసీల్దార్ గొల్లపల్లి శ్రీనివాసులును ముడుపులతో మభ్యపెట్టారు. సర్వే నంబర్ 5 – 1లో 4.9.. సర్వే నంబర్ 5 – 2లో 4.5.. సర్వే నంబర్ 6 – 1లో 4.8.. సర్వే నంబర్ 6 – 2లో 4.75.. సర్వే నంబర్ 7 – 1లో 4.24.. సర్వే నంబర్ 7 – 2లో 2.5.. సర్వే నంబర్ 7 – 3లో 2.42 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏడుగురి పేర్లతో వన్ – బీ, అడంగళ్‌లో 2019 ఫిబ్రవరిలో నమోదు చేశారు. ఆ పేర్లు గల వ్యక్తులు స్థానికులు కూడా కాదు. పైగా ఈ భూముల్లో సాగు చేయలేదు.

నూతనంగా వచ్చా..

ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టా. ఈ విషయం నాకు తెలియదు. పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపడతా.

– స్వరూపరాణి, తహసీల్దార్

ప్రశాంతిరెడ్డికి నిరసన సెగ

- గో బ్యాక్ అనే నినాదాలతో అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- ఆత్మీయ సమావేశానికి రాకుండానే వెనుదిరిగిన వైనం



భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

ఇందుకూరుపేట: మండలంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి నిరసన సెగ ఎదురైంది. ప్రశాంతిరెడ్డి గో బ్యాక్.. ప్రశాంతిరెడ్డి డౌన్ డౌన్ అనే నినాదాలతో సొంత పార్టీ నేతలే నిరసనకు దిగారు. ఈ పరిణామాలతో ఆమెతో పాటు వచ్చిన నేతలు నివ్వెరపోయారు. వివరాలు.. గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో తొలుత ఆమె పూజలు చేశారు. అనంతరం స్థానిక టీడీపీ నేత సుధాకర్‌రెడ్డి నివాసంలో నిర్వహించాల్సిన ఆత్మీయ సమావేశానికి వచ్చారు. ఈ తరుణంలో ఆమె కారు దిగగానే తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా భగ్గుమన్నారు. ప్రశాంతిరెడ్డి డౌన్ డౌన్ అంటూ.. దినేష్‌రెడ్డికి జై కొడుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఎంతటికీ సద్దుమణగకపోవడంతో ఆత్మీయ సమావేశానికి హాజరుకాకుండానే ఆమె వెనుదిరిగారు. దినేష్‌రెడ్డిని కాదని ప్రశాంతిరెడ్డిని కోవూరు అభ్యర్థిగా నిర్ణయించడాన్ని సహించలేక టీడీపీ మండలాధ్యక్షుడు వీరేంద్ర వర్గం ఈ రచ్చకు పూనుకుంది. మరోవైపు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి నాయకత్వాన్ని జీర్ణించుకోలేక ఆయన స్వగ్రామానికి చెందిన వారు సైతం ఈ ఆందోళనలో ప్రధాన భూమిక పోషించారని తెలిసింది. కాగా అక్కడే ఉన్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి నిరసన వ్యక్తం చేస్తున్న వారిని వారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రశాంతిరెడ్డి వెనుదిరిగాక దినేష్‌రెడ్డి తన అనుచరులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి తదుపరి కార్యాచరణపై చర్చించారని సమాచారం.

క్లుప్తంగా

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: జిల్లాలోని గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్ జీ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఉదయగిరిలో విలేకరులతో మాట్లాడారు. గండిపాళెం, నెల్లూరు (బాలురు), ఆత్మకూరు, తుమ్మలపెంట (బాలికల) గురుకుల పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8,9 తరగతుల్లోని ఖాళీలకు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నెల్లూరులోని మైనార్టీ బాలుర గురుకులంలో నేరుగా ప్రవేశం కల్పిస్తామన్నారు. మిగిలిన గురుకులాలకు సంబంధించి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 87126 25045 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

పొదలకూరు : భారత ఎన్నికల కమిషనర్ నిర్దేశించిన నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని సర్వేపల్లి ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చినఓబులేసు హెచ్చరించారు. పట్టణంలోని కల్యాణ మండపాలు, పాన్‌బ్రోకర్స్ దుకాణా లు, మద్యం షాపులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచార ర్యాలీలు, సభలు, సమావేశాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు.పాన్‌బ్రోకర్స్(కుదువ) ద్వారా నగదు మార్పిడి జరుగుతున్నట్టుగా తమకు సమాచారం అందిన నేపథ్యంలో దుకాణాలను తనిఖీ చేశామన్నారు. మద్యం కట్టడికి దుకాణాల్లోని స్టాక్‌ను పరిశీలించామని తెలిపారు. ఆర్‌ఓ వెంట తహసీల్దార్ వీరవసంతరావు, వీఆర్వో శ్రీహరి తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు బలి



విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సోమశిల/గుడ్లూరు: జిల్లాలోని వేర్వేరు మండలాల్లో విద్యుదాఘాతాని కి ఇద్దరు బలయ్యారు. గుడ్లూరు మండలంలో ఓ దివ్యాంగుడు మృతి చెందగా, సోమశిలలో సచివాలయ సర్వేయర్ మృత్యువు పాలయ్యాడు. వివరాలు..

పెళ్లైన పదిరోజులకే..

అనంతసాగరం మండలం వెంకటరెడ్డిపల్లికి చెందిన కేతా కృష్ణారెడ్డి, సుందరమ్మ దంపతులు. వారి కుమారుడు కేతా విష్ణువర్ధన్‌రెడ్డి(27) కామిరెడ్డిపాడు సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఈ నెల 13న ఏఎస్‌పేట మండలం హసనాపురానికి చెందిన సంధ్యతో వివాహం జరిగింది. ఆదివారం ఉదయం విష్ణువర్ధన్‌రెడ్డి నల్లరాజుపాళెంలో ఉన్న తమ పొలాల వద్దకు వెళ్లారు. మోటారు పనిచేయకపోవడంతో విద్యుత్ లింకులు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న కుమారుడ్ని చూసి బోరున విలపించారు. వివాహమైన పది రోజులకే విష్ణువర్ధన్‌రెడ్డి మృతి చెందడంతో వెంకటరెడ్డిపాళెంలో విషాదం నెలకొంది. మృతుడి భార్యను ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిర్భూమికి వెళ్లి దివ్యాంగుడు..

గుడ్లూరు మండలంలోని నరసాపురానికి చెందిన దివ్యాంగుడు పరుచూరి రాజా(40) ఊరి చివర ఉన్న శ్మశాన వాటికిలోకి శనివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో మృతి చెందాడు. సాయంత్రం 6 గంటలైనా ఇంటికి రాకపోయేసరికి తండ్రి మాలకొండయ్య వెతుకుతూ శ్మశానం వద్దకు వెళ్లగా కుమారుడు విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాలకొండయ్య ఫిర్యాదు మేరకు గుడ్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోయలచిరివెళ్లలో విషాదఛాయలు

- హైదరాబాద్‌లో బైక్‌ను ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్
- బతుకుదెరువుకు వెళ్లిన యువకుడి దుర్మరణం



విజయ్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూరు: హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ యువకుడు శనివారం అర్ధరాత్రి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మండలంలోని బోయలచిరివెళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. బోయలచిరివెళ్లకు చెందిన రావూరు బ్రహ్మారెడ్డి కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డి (25) హైదరాబాద్‌లో ర్యాపిడో బైక్ ట్యాక్సీ కెప్టెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి ఓ ప్రయాణికుడ్ని తన బైక్‌పై ఎక్కించుకుని హైదరాబాదు శివారు ప్రాంతంలో వెళ్తుండగా ఎదురుగా సిమెంట్ ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకనున్న ప్రయాణికుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. బతుకుదెరువు కోసం వెళ్లిన విజయకుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

ఎన్నికలపై డేగ కన్ను

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- 5,882 మంది బైండోవర్
- 18 చెక్‌పోస్టుల ఏర్పాటు
- మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బంది విధులు
- ఎంసీసీ ఉల్లంఘనపై తొమ్మిది కేసులు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సివిల్, కేంద్ర బలగాలతో కవాతు చేపడుతున్నారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తున్నారు. రీ పోలింగ్‌కు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 107, 109, 110 సీఆర్‌పీసీ కింద రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో ఉన్న సుమారు 5,882 మందిని ముందస్తుగా బైండోవర్ చేశారు. జిల్లాలో 533 మంది లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగి ఉన్నారు. అందులో బ్యాంకులకు సంబంధించిన 48 ఆయుధాలు మినహా మిగిలిన వాటిని డిపాజిట్ చేసుకున్నారు. ఎంసీసీ(మోడల్ కోడ్‌ఆఫ్ కండక్ట్) ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆత్మకూరు, కావలి, కందుకూరు నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది కేసులు నమోదు చేశారు. ఇప్పటికే మూడు ప్లటూన్‌ల బీఎస్‌ఎఫ్ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. ఎన్నికల నాటికి మరో మూడుకుపైగా ప్లటూన్‌లు రానున్నాయి.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలోని 1442 ప్రాంతాల్లో ఉన్న 2,470 పోలింగ్ కేంద్రాల్లో 424కుపైగా కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వాటిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు మమేకమవుతున్నారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించడంతో పాటు అశాంతి, అల్లర్లు, గొడవలు ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. దీంతో పాటు పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను సందర్శించి పటిష్ట భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

18 చెక్‌పోస్టులు..26 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

ఎన్నికల్లో నగదు, మద్యం, ఇతర ప్రలోభాలను పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా జిల్లాలోని కందుకూరు నియోజకవర్గ పరిధిలోని మన్నేరు బ్రిడ్జి సౌత్, పంటపాళెం క్రాస్‌రోడ్డు(కందుకూరు–శింగరాయకొండ రోడ్డు), దూబగుంట(కందుకూరు–కనిగిరి రోడ్డు), మాలకొండ, కందుకూరు–పామూరు రోడ్, ఇక్కిరాలపేట–చిలుకూరుపాడు, కావలి నియోజకవర్గ పరిధిలోని గౌరవరం టోల్‌ప్లాజా, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని శింగనపల్లి, కోవూరు నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా, వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలం పంగిలి–చిట్వేల్‌రోడ్డు, మద్దెలమడుగు రోడ్డు జంక్షన్, సైదాపురం కైవల్యానది, ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని సీతారామపురం–బద్వేల్ రోడ్డు, చిన్ననాగంపల్లి–డీజీపేటరోడ్డు, వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు, కృష్ణపట్నం పోర్టు సౌత్‌గేట్, వెంకటాచలం టోల్‌ప్లాజా మొత్తంగా 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల్లోని సిబ్బంది రౌండ్‌ది క్లాక్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వీటితో పాటుగా రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు వీడియోగ్రాఫర్‌తో కూడిన 26 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి మూడు స్క్వాడ్‌లను కేటాయించారు. వారు ఆయా నియోజకవర్గాల్లో రౌండ్‌ది క్లాక్ విధులు నిర్వహిస్తాయి.

సంయుక్తంగా..

ఎస్‌ఈబీతో కలిసి మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలు, నిల్వలపై ఉక్కుపాదం మోపేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళుతున్నారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకోవడంతో పాటు అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాల కేసుల్లోని నిందితులను బైండోవర్లు చేయాలని ఎస్‌ఈబీ అధికారులకు ఆదేశాలు అందాయి.

ఇంటింటా ప్రచారానికి అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న తప్పనిసరిగా రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి అనుమతి పొందాలి. బహిరంగ సమావేశాలు, సభలతో పాటు ఇంటింటా ప్రచారానికి అనుమతులు తప్పనిసరి చేశారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది.

నిష్పక్షపాతంగా విధులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియమ, నిబంధనలకు లోబడి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఇప్పటికే ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ ప్రాంతాల్లో అనధికార మద్యం విక్రయాలు, నిల్వలు, పంపిణీ, తదితరాలను ప్రజలు గుర్తిస్తే డయల్ 112కు లేదా స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు, నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే రాజకీయ పార్టీలే కాకుండా ప్రజలు సైతం సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెబుతున్నారు.



ఇటీవల జరిగిన నేర సమీక్షలో సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి (ఫైల్)

నయవంచకుడు చంద్రబాబు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: నయవంచకుడైన చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంట, అబ్బిసాహెబ్ కండ్రిగ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలనే లక్ష్యంతో టీడీపీ, బీజేపీ, జనసేన మరోసారి జతకట్టాయని విమర్శించారు. 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని మోసపూరిత వాగ్దానాలు ఇవ్వడంతో చంద్రబాబుకు ప్రజలు అధికారం కట్టబెట్టారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకపోవడంతో 2019 ఎన్నికల్లో ఇంటికి పంపారన్నా రు. 2019 ఎన్నికల్లో నరేంద్రమోదీని విమర్శించిన బాబు మతతత్వ పార్టీ బీజేపీతో మరోసారి జతకట్టడంపై ముస్లింలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆచరణ సాధ్యమైన వాగ్దానాలు ఇవ్వడంతో ప్రజలు విశ్వసించి తిరుగులేని విజయాన్ని అందించారన్నారు. అందుకనుగుణంగా పాలనలో విప్లవాత్మక మార్పు లు తీసుకురావడంతో పాటు ఎన్నికల వాగ్దానాలను నూటికి నూరుశాతం నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారన్నారు. తాను మీ కుటుంబానికి మేలు చేశానని నమ్మితేనే తనకు ఓటేయాలన్న దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో మంత్రిగా వెలగబెట్టిన సోమిరెడ్డి దోచుకోవడం, దాచుకోవడం తప్ప నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఐదేళ్ల జగనన్న పాలనలో సర్వేపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాబోయే ఎన్నికలు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైస్‌ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కే మోహన్‌నాయుడు, జెడ్పీటీసీ పొట్లూ రు సుబ్రహ్మణ్యం, ఎంపీపీటీసీ వేమారెడ్డి రఘునందన్ రెడ్డి, నాయకులు ఎం పెంచలయ్య, ఏ ప్రభాకర్ రెడ్డి, కే విజయభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 200 మంది చేరిక



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్ వైఎస్సార్‌నగర్, వల్లూరమ్మ కాలనీ, శ్రామికనగర్, 36వ డివిజన్‌లోని బ్రహ్మానందపురం, తదితర ప్రాంతాలకు చెందిన 200 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ కార్పొరేటర్ పిండి సురేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నగరంలోని తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్‌ను ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మేకపాటిని సత్కరిస్తున్న స్థానికులు

ఉదయగిరి: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఆశీర్వదించి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉదయగిరిలోని నాగులబావి వీధి, సుద్దబావి వీధి, రజక వీధుల్లో విజయ సంకల్పయాత్రను ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రెండోదఫా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతాన్ని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. టీడీపీ నేతలు, ఎల్లో మీడియా అసత్య ఆరోపణలను నమ్మకుండా మీకు మంచి చేసిన జగనన్నకు మద్దతుగా నిలవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోని తేడాను గమనించి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటేయాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, నాయకులు మూలె వినయ్‌రెడ్డి, అక్కుల్‌రెడ్డి, గడియాల్చి యస్దాని, సలీం, శ్రీనివాసులురెడ్డి, షంషీర్, ఎం వీరారెడ్డి, ఆక్కి భాస్కర్‌రెడ్డి, ఉప్పుటూరి శ్రీను పాల్గొన్నారు.

వేమిరెడ్డికి దమ్ముంటే సమాధానం చెప్పాలి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పంచేడులో విలేకరుల సమావేశంలో తాను, ఎంపీ విజయసాయిరెడ్డి సంధించిన ప్రశ్నలకు దమ్ముంటే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమాధానం చెప్పాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తితో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బహిరంగ సభల్లో, విలేకరుల సమావేశంలో మాట్లాడటం కూడా రాని వేమిరెడ్డి తాము సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తన అనుచరులు, ఇంట్లో పనిచేసే వారితో మాట్లాడించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. వేమిరెడ్డి గురించి విజయసాయి రెడ్డి మాట్లాడిన విషయాలన్నీ వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నెల్లూరులో ఒక్కరోజైనా ఉన్నావా అని ధ్వజమెత్తారు. ఎప్పుడు ఎక్కడుంటారో తనకే తెలియదని, అలాంటి వ్యక్తి తమపై చెంచాగాళ్లతో విమర్శలు చేయించడం మంచిదికాదన్నారు. టీడీపీ రాజ్యసభకు నామినేట్ చేయకపోవడంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి దగ్గరికి వచ్చి మొరపెట్టుకుంటే పంపడం జరిగిందన్నారు. ఆరేళ్ల పదవి అనుభవించి ప్రస్తుతం అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు చంద్రబాబు గురించి చేసిన విమర్శలు మర్చిపోయావా అని ఎద్దేవా చేశారు. నెల్లూరు సిటీ అభ్యర్థిగా సామాన్య వ్యక్తి, మైనార్టీ నాయకుడికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇవ్వడం వేమిరెడ్డి జీర్ణించుకోలేక పోయాడన్నారు. ఇలాంటి వ్యక్తి పేద ప్రజలకు ఏంసేవ చేస్తారో అర్థం కావడం లేదన్నారు. కేవలం డబ్బుతో ప్రజలను కొనాలని చూస్తే వారు తగిన విధంగా సమాధానం చెబుతారన్నారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా కోవూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేశారన్నారు. అలాంటి రాజకీయ చరిత్ర కలిగిన వారిపై రాజకీయంలో ఓనమాలు కూడా తెలియని కొందరు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. గత ఎన్నికల్లో ప్రసన్నకుమార్‌రెడ్డికి 39వేలకు పైగా మెజార్టీ వచ్చిందని, మేలో జరిగే ఎన్నికల్లో 50వేలకు పైగా మెజార్టీ రావడం తథ్యమన్నారు. వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏనుగు రమణారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏనుగు రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్రాధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీజీఈఏ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏనుగు రమణారెడ్డి ఉద్యోగులకు అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించడంపై రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, జీ ఆస్కార్‌రావ్, రాష్ట్ర సలహా సంఘ చైర్మన్ చొప్పా రవీంద్రబాబుకు జిల్లా అధ్యక్షకార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రాంప్రసాద్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	128
లేయర్ (లైవ్)	73
బ్రాయిలర్ చికెన్	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	254
లేయర్ చికెన్	125